
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శనివారం 20 జనవరి 2024



5

సుస్థిర జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

- ఎన్‌జీసీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్

8



నిట్‌లో సాంకేతిక సంబురం

ఉత్సాహంగా మొదలైన టెక్నోజియాన్

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు
- 40కి పైగా ఈవెంట్ల నిర్వహణ
- క్యాంపస్‌లో సందడి చేస్తున్న మినీ భారతం
- కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఊపిరి
- నేడు, రేపు కొనసాగనున్న వేడుకలు



టెక్నోజియాన్‌లో నగరానికి చెందిన పాఠశాల విద్యార్థి తయారు చేసిన ఎగ్జిబిట్ గురించి అడిగి తెలుసుకుంటున్న నిట్ విద్యార్థి

7



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న నిట్ కళాశాల రీసెర్చ్ కన్సల్టెన్సీ డీన్ వి.టి.సోమశేఖర్

నగరంలోని ప్రతిష్ఠాత్మక నిట్‌లో సాంకేతిక ఉత్సవం 'టెక్నోజియాన్-2024' శుక్రవారం సందడిగా మొదలైంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయడంతో పాటు పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకునేందుకు నిట్ ప్రతీ ఏటా 'టెక్నోజియాన్'ను నిర్వహిస్తోంది. ఈనెల 21 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో 40కిపైగా ఈవెంట్లను ప్రదర్శిస్తారు. దేశంలోని వివిధ నిట్ కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఈ ఈవెంట్లలో పాలుపంచుకోనున్నారు. ఈ సంవత్సరం ఇంజినీయస్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకను శుక్రవారం ప్రఖ్యాత ఏరోస్పేస్, మిస్సైల్ సైంటిస్టు ప్రొఫెసర్ సుందర రాజన్ ప్రారంభించాల్సి ఉండగా, అనారోగ్య కారణాలతో హాజరుకాలేక పోయారు. దీంతో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి. సోమశేఖర్ టెక్నోజియాన్‌ను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో క్యాంపస్ అంతటా మినీ భారతం కళ్లకు కడుతోంది.

-ఆంధ్రజ్యోతి, హనుమకొండ/కాజీపేట

కాళేశ్వరం అవినీతిపై దూకుడు!

విచారణలో వేగం పెంచిన విజిలెన్స్ అధికారులు



మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లరు వద్ద ఫోన్‌లో ద్యామేజీని చిత్రీకరిస్తున్న డీజీ రాజీవ్‌రతన్ బృందం

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు పంపుహౌస్‌ల్లో తనిఖీలు
- కాళేశ్వరం ఇంజనీర్ల నుంచి కీలక సమాచారం సేకరణ
- ప్రాజెక్టు నిర్మాణానికి అప్పులిచ్చిన బ్యాంకు అధికారుల బృందం పర్యటన
- కాగ్ నివేదికతో కాళేశ్వరం అవినీతిపై ప్రభుత్వం వేగంగా ముందుకు

భూపాలపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని అవినీతిని వెలికి తీసేందుకు ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే జ్యూడిషియల్ విచారణకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని కోరుతూ ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసింది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ఫైల్స్ దారి తప్పకుండా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. దీంతో విజిలెన్స్ అధికారుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు లక్ష్మీ పంపుహౌస్‌ల్లో రెండు విడతలుగా సోదాలు నిర్వహించింది. మరోసారి కీలకమైన ఆధారాలతో తనిఖీలు, నాణ్యత పరిశీలనకు విజిలెన్స్ బృందం రానున్నట్లు సమాచారం. అయితే ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నివేదికలో భారీ అక్రమాలు జరిగినట్లుగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణానికి అప్పులు ఇచ్చిన బ్యాంకు అధికారుల బృందం ప్రాజెక్టు పరిశీలనకు రావడం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఫోకస్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా పని చేస్తుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు రేవంత్‌రెడ్డి సైతం విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కాళేశ్వరంపై విచారణ చేయిస్తామని హామీ ఇచ్చి గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి పెట్టారు. ఇప్పటికే మంత్రుల బృందం పర్యటనతో పాటు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇప్పించారు. అంతేకాకుండా ప్రాజెక్టుపై న్యాయ విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. విచారణ జరిపేందుకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని కోరుతూ ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసింది. అంతేకాకుండా ప్రాజెక్టు ఫైల్స్ దారి తప్పకుండా ముందు జాగ్రత్తగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో తొలుత ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 10 చోట్ల ఏకకాలంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పత్రాలు, ఎంబీ రికార్డులతో పాటు హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. మూడు రోజుల పాటు జిల్లాలోని మహ దేవపూర్ ఐబీ కార్యాలయంలో ఫైళ్లను విజిలెన్స్ టీమ్ పరిశీలించింది. కీలకమైన వాటిని హైదరాబాద్‌లోని విజిలెన్స్ ప్రధాన కార్యాలయంకు తరలించారు. అనంతరం విజిలెన్స్ విభాగంలోని ఇంజనీర్లు, సాగు నీటి రంగ నిపుణులతో స్వాధీనం చేసుకున్న ఫైళ్లు, ఎంబీ రికార్డులు, హార్డ్ డిస్కులను పరిశీలించారు. ఆ తరువాత వారం రోజుల్లోనే తిరిగి ఈ నెల 17, 18, 19 తేదీల్లో మరోసారి విజిలెన్ డీజీ రాజీవ్‌రతన్ ఆధ్వర్యంలో 20 మంది బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు లక్ష్మీ పంపుహౌస్‌ను తనిఖీ చేశారు. మీడియాను వెంట తీసుకెళ్లి గోదా వరి వరదలకు దెబ్బతిన్న లక్ష్మీ పంపుహౌస్ మో టార్లను పరిశీలించారు. రక్షణ గోడ దెబ్బతినడంతో మోటార్లకు జరిగిన నష్టంపై వివరాలు తెలు సుకున్నారు. పంపుహౌస్ రక్షణ గోడల నాణ్యతతో పాటు డిజైన్‌ను పరిశీలించారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు వచ్చిన 20వ పిల్లర్‌ను పరిశీలించారు. అక్కడ మట్టి నమునాలను సేకరిం చారు. ఇసుకలో కదిలికలు రావడానికి గల కారణా లను విజిలెన్స్ ఇంజనీర్ల బృందం వివరాలు సేకరిం చింది. అన్నారం బ్యారేజీలో లీకేజీలను పరిశీలిం చారు. సుందిళ్ల బ్యారేజీని కూడా సందర్శించారు. మూడు రోజుల పాటు బ్యారేజీలు, పంపుహౌస్‌ల పరిశీలనతో పాటు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను ప్రభుత్వం వేగంగా చేపడుతుందనే టాక్ వినబడుతోంది.

అప్పులిచ్చిన బ్యాంకర్ల ప్రాజెక్టు బాట

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం భారీగా అప్పులు చేసింది. దీనికి కోసం కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసి గత ప్రభుత్వం రూ.87,499 కోట్ల అప్పులను తీసుకవచ్చింది. వివిధ బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో అప్పులు తీసుకురావటంతో వాటిని రాబట్టుకునేందుకు ప్రతి ఏటా ప్రాజెక్టులను పరిశీలిస్తారు. అయితే ఈసారి కాగ్ నివేదికతో పాటు ప్రభుత్వం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టంతో బ్యాంకర్లు ప్రాజెక్టులను సందర్శించటం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీతో పాటు లక్ష్మీ పంపుహౌస్‌ను వివిధ బ్యాంకుల నుంచి వచ్చిన అధికారులు పరిశీలించారు. పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయక పోవటంతో పాటు చేపల పెంపకం కోసం రిజర్వాయర్లలో నీళ్లు లేకపోవటంపై బ్యాంకర్లు అధికారులను ప్రశ్నించినట్లుగా సమాచారం. తమకు చెల్లించాల్సిన కిస్తీల గురించి కాళేశ్వరం ఇంజనీర్లకు సమాచారం ఇచ్చినట్లుగా తెలిసింది. మొత్తానికి కాళేశ్వరం ప్రాజెక్టు పై విచారణను ప్రభుత్వం స్పీడ్ పెంచటంతో పాటు బ్యాంకర్లు అప్పులను వసూళ్లు చేసేందుకు ప్రాజెక్టు బాట పట్టడం హాట్‌టాపిక్‌గా మారింది.

కాగ్ నివేదికతో దూకుడు

ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) ఇచ్చిన నివేదికతో ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది. ప్రాజెక్టు నిర్మాణానికి సీడబ్ల్యూసీ రూ.81,911.01 కోట్లకు అనుమతులు ఇచ్చింది. అయితే గత ప్రభుత్వం రూ.1,49,317.22 కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచి ప్రాజెక్టు నిర్మించినట్లుగా కాగ్ పేర్కొంది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు కోసం రూపాయి ఖర్చు చేస్తే రూ.1.52 పైసలు ఆదాయం వస్తుందని డీపీఆర్‌లో వివరించారు. కాళేశ్వరం రిజర్వాయర్లలో చేపల పెంపకం ద్వారా రూ.1,750 కోట్లు, 20 రిజర్వాయర్ల పరిధిలో 3.5 లక్షల హెక్టార్ల పరిధిలో చేపలు పెంపకం ఉంటుందని గత ప్రభుత్వం చెప్పినట్లుగా కాగ్ నివేదికలో పేర్కొంది. అయితే ఏం చేసినా రూపాయి ఖర్చు చేస్తే వచ్చేది కేవలం 52 పైసలే అని కాగ్ తేల్చి చెప్పింది. దీంతో ప్రాజెక్టు మూలంగా ప్రభుత్వానికి భారీగా నష్టం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టులో మోటార్లు నడిచినా, నడవక పోయినా ఏటా ఫిక్స్‌డ్ చార్జీలు రూ.1,337.59 కోట్లు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రాజెక్టు కోసం చేసిన అప్పులు, నిర్వహణ తదితర వాటికి ఏటా బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని కాగ్ నివేదికలో పేర్కొంది. అంతేకాకుండా మోటార్ల కొనుగోలులో ధరలను అధికంగా చెల్లించినట్లుగా పేర్కొంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం ఉందని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం విచారణను మరింత వేగం చేస్తోంది. ప్రధానంగా భూపాలపల్లి జిల్లాలో చేపట్టిన బ్యారేజీలు, గ్రావిటీ కెనాల్, పంపుహౌస్‌ల్లోనే అధికంగా అక్రమాలు జరిగినట్లుగా భావిస్తున్నారు.



కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- మంత్రి సీతక్కను కోరిన ఎమ్మెల్యే గండ్ర



మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి టౌన్, జనవరి 19: భూపాలపల్లి నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలిసి విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గల ఛాంబర్‌లో మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గం డ్ర మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు రోడ్లకు నిధులు మంజూరు కావాలని తెలిపానన్నారు. ఎమ్మెల్యే గండ్ర విన్నపంపై మంత్రి సీతక్క సాను కూలంగా స్పందించినట్లు చెప్పారు. రోడ్ల అభివృద్ధికి తప్పకుండా నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తా నని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ అ ధికార ప్రతినిధి గాదర్ల అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు సూరం వీరేందర్ ఉన్నారు.

నాకే ఆబ్సెంట్ వేస్తావా..? మీ అంతు చూస్తా..!

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిపై చేయి చేసుకున్న ఏడీఏ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన డీఏవో విజయ్‌భాస్కర్



భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 19: నీ అంతు చూస్తా... నాకే ఆబ్సెంట్ వేస్తావా..? అంటూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్‌పై ఏడీఏ శ్రీధర్ దాడికి దిగారు. మీరు జిల్లాలో ఎలా పనిచేస్తారో చూస్తానని డీఏవోను చెంపదెబ్బ కొట్టడంతో పాటు కార్యాలయంలోనే ఏడీఏ బెదిరింపులకు పాల్పడ్డాడు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్‌పై ఏడీఏ టెక్నికల్ శ్రీధర్ చేయి చేసుకోవడం భూపాలపల్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. విధులకు సెలవు పెట్టకుండా గైర్హాజరు కాగా, ఆబ్సెంట్ వేయడంతో ఏడీఏ శ్రీధర్ వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ్‌భాస్కర్‌పై భూపాలపల్లిలోని వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దాడికి పాల్పడ్డారు. ఏడీఏ దాడిపై కలెక్టర్ భవేష్ మిశ్రాకు విన్నవించడంతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విజయ్‌భాస్కర్ ఫిర్యాదు చేశాడు.

ఈ మేరకు బాధితుడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ నెల 17, 18 తేదీల్లో ఏడీఏ టెక్నికల్ శ్రీధర్ సెలవు పెట్టకుండా, ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరుకాకపోవడంతో గైర్హాజర్ వేశాడు. దీంతో శుక్రవారం కార్యాలయానికి వచ్చిన శ్రీధర్.. తనకే ఆబ్సెంట్ వేస్తావా..? అని చెంపపై కొట్టి బెదిరించాడు. సిబ్బంది విధులకు హాజరు కాకపోతే ఆబ్సెంట్ వేసే అధికారం తనకు ఉందని, అందుకే గైర్హాజర్ వేశానని, ఏడీఏ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ ఉన్నతాధికారులను కోరారు.

మేడారంలో గిరిజన కళాకృత సమ్మేళనం

- టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అరుణ్‌కుమార్
- మ్యూజియం, హరిత హోటల్ సందర్శన



మ్యూజియం ఆవరణాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ అరుణ్‌కుమార్

మేడారం, జనవరి 19 : మేడారం మహాజాతరలో గిరిజన కళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ కళాకృత సమ్మేళనం నిర్వహించనున్నట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం పర్యటనలో భాగంగా ఆదివాసీ మూజియం, హరిత హోటల్‌ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే సమ్మక్క, సారలమ్మ మహా జాతరలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల గిరిజన కళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ కళాకృత సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన 20 మంది గిరిజన కళాకారులు గిరిజన కళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్‌ను విక్రయించనున్నట్లు తెలిపారు. అదే విధంగా కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో థీమ్ పెవిలియమ్ ఏర్పాటు చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన సంప్రదాయ సంస్కృతుల కళాఖండాలను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. మేడారం జాతరలో ఏర్పాటు చేయబోయే గిరిజన కళాకృత సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లు చేపడుతామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళాకారుల కోసం సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, మేడారం దేవస్థానం నిర్వహణ అధికారి రాజేంద్రం, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంత రావు, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఎస్‌వో రాజ్ కుమార్ తదితులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

- భూపాలపల్లిలో రెండో రోజు కొనసాగిన కోల్ ఇండియా క్రీడలు



పోటీ పడుతున్న ఎంసీఎల్ ఒడిషా, బీసీసీఎల్ జార్ఖండ్ జట్ల క్రీడాకారులు

కాకతీయఖని, జనవరి 19 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో హాకీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో రెండవ రోజు కొనసాగిన కోల్ ఇండియా క్రీడల్లో పలు జట్లు ప్రత్యర్థిపై నువ్వా.. నేనా.. అన్నట్లు పోరాడి విజయకేతనం ఎగురవేశాయి. శుక్రవారం ఉదయం మొదటి మ్యాచ్ ప్రారంభం కాగా, ఇందులో ఎంసీఎల్ ఒడిషా,

- మిగతా 8వ పేజీలో..

పతంగులు తెచ్చిన తంటా

ఇద్దరిపై దాడి చేసిన యువకులు.. కేసు నమోదు

హనుమకొండ క్రైం, జనవరి 19: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎగురవేసే పతంగుల పండగ ఘర్షణకు దారి తీసింది. ఒకరి గాలిపటాన్ని మరొకరు ఒకరు తెంపేయడంతో ఏర్పడిన గొడవ కొట్లాటకు దారి తీసింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన చెన్నం నితిన్ సాయి ఈ నెల 16న తన ఇంటిపై గాలిపటం ఎగరేసుకుంటున్నాడు. ఇంటి సమీపంలో ఉన్న శివ, మింటూ, వీరస్వామి పతంగులు ఎగరేస్తున్నారు. ఈ క్రమంలో నితిన్ సాయి పతంగిని శివ, మింటూ, వీరస్వామిలు గాలిపటంతో కట్ చేశారు. విషయాన్ని నితిన్ సాయి తన తండ్రి శ్రీనివాస్‌కు చెప్పడంతో వారిని మందలించాడు. ఇది దృష్టిలో పెట్టుకున్న వారు ఇద్దరు శ్రీనివాస్, నితిన్ సాయిలపై పగ పెంచుకున్నారు. మరునాడు సాయంత్రం శ్రీనివాస్, నితిన్‌సాయిలు రెడ్డికాలనీలో వ్యక్తిగత పనిమీద వెళ్లి వస్తుండడంతో వారిని ముగ్గురు కలిసి అడ్డగించారు. నానా దుర్భాషలాడుతూ మీద పడి పిడిగుద్దులు గుద్దారు. దాడి చేసి చంపేస్తామని హెచ్చరించి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు శ్రీనివాస్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కేయూ పార్మసీ డీన్‌గా గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, జనవరి 19: కేయూ ఫార్మసీ నూతన డీన్‌గా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు వెలువరించారు. బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ గాదె సమ్మయ్యను వర్సిటీ ప్రొఫెసర్లు పి.మల్లారెడ్డి, ఎస్.ప్రసాద్, కృష్ణవేణి, నాగరాజు, పరిశోధకులు, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

కాజీపేటలో చోరీ, నగదు మాయం

కాజీపేట, జనవరి 19: కాజీపేట జూబ్లీమార్కెట్‌లో ఓఇంట్లో చోరీ జరిగింది. దుండగులు నగదును దోచుకెళ్లారు కాజీపేట పోలీసుల వివరాలు ప్రకారం.. కాజీపేట జూబ్లీ మార్కెట్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దుండగులు ఇంట్లో బీరువా తలుపులు తీసి అందులో ఉన్న నగదు రూ.2 లక్షల 48 వేలు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాజీపేట, జనవరి 19: కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 1లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ గుర్తుతెలియని మృతదేహం లభించింది. మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఎత్తు 5.5, ఎరుపు, తెలుపు గడ్డం. పొడువైన ముఖం, సిమెంట్ కలర్ ప్యాంట్, బ్రింజాల్ కలర్ ఫుల్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో బాసర - రాజమండ్రి జనరల్ టికెట్ ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు రాజమండ్రికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో బద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో నైనా, 9866167291 లేదా 9440604320 కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

పైపులైన్ గేట్ వాల్వ్ చోరీ

వేలేరు(ధర్మసాగర్), జనవరి 19: సాగునీటి పైపులైన్ గేట్ వాల్వ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు ఎస్ఐ హరిత శుక్రవారం తెలిపారు. గుండ్లసాగర్ గ్రామం వద్ద పైపులైన్‌కు బిగించిన గేట్‌వాల్‌ను చోరీ చేశారు. దిని విలువ సుమారు రూ.25,000 వరకు ఉంటుందని పైపులైన్ ఇన్‌చార్జి గాదె రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జంపన్నవాగు వద్ద పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పారిశుధ్యం పనుల పరిశీలన

మేడారంలో పర్యటించిన ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 19: తాడ్వాయి మండలం మేడారంలో పారిశుధ్యం పనులను ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం తిరిగి పరిశీలించారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు వెంటవెంటనే పారిశుధ్యం పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహాజాతరకు సమయం దగ్గరపడుతున్నందు ముందస్తు మొక్కులు చెల్లించే భక్తుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు కాబట్టి.. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉండాలన్నారు. సౌకర్యాల వద్ద సిబ్బందిని నియమించాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు.

అనంతరం టీటీడీ కల్యాణ మండపంలోని మీడియా పాయింట్ పరిశీలించారు. సమ్మక్క సారలమ్మల కీర్తిప్రతిష్ఠలు దేశ నలుమూలలా తెలియజేయడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జాతర కవరేజ్ చేయడానికి వచ్చే జర్నలిస్టులకు సదుపాయాలు, సౌకర్యాలు మేరుగా కల్పించాలని, భవనంలో చేయవల్సిన మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, గ్రామ పంచాయతీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు మొక్కుల జోరు

వనదేవతల సన్నిధికి 30వేలకు పైగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 19: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం 30వేల మందికిపైగా భక్తులు మేడారం తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ దేవతలకు మహాజాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దూరప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో మేడారం వచ్చిన భక్తులు ముందుగా జంపన్నవాగు పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారె కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకొని పూజాలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

రేపే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

● మల్లన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం ● మూడునెలల జానపదుల జాతరకు అంకురార్పణ





చేర్యాల, జనవరి19: కొమురవెల్లి మల్లన్న ఆలయం పట్నంవారానికి సిద్ధమైంది. ఏడో తేదీన నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, ఆదివారం నిర్వహించనున్న పట్నంవారంతో మూడునెలల జాతరకు అంకురార్పణ పడనున్నది. ప్రతీ ఆదివారం 12 వారాల పాటు జానపదుల జాతర సాగనుంది. శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల దరువుతో విజయాచల గుట్టలు మార్మోగనున్నాయి.

పట్నంవారం అంటే..

సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తుండటం అనాదిగా వస్తోంది. మల్లన్న యాదవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవిని వివాహమాడిన నేపథ్యంలో యాదవులకు ఈ వారం అత్యంత ప్రీతికరం. హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు శనివారం ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుంటారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండానే స్వామివారిని నేరుగా ధూళి దర్శనం చేసుకుంటారు. ఆదివారం తెల్లవారుజామునే తలనీలాలు అందించి పుణ్యస్నానమాచరిస్తారు. స్థానికంగా కూరగాయలు, మట్టికుండలు కొనుగోలు చేసి భక్తిప్రపత్తులతో బోనం తయారుచేస్తారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బెల్లంపాయసంతో బోనం నివేదిస్తారు. పట్నం వేసి సహపంక్తి భోజనం చేస్తారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పిస్తారు. అలాగే స్వామివారి తోబుట్టువు అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు చేసి నివేదిస్తారు. మరుసటి సోమవారం రోజున హైదరాబాద్‌కు చెందిన యాదవపూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. మల్లన్నను ఇతరుల రూపంలో భావించి వంటినిండా పసుపు ధరించి స్వామివారి ఆవాహనంతో అగ్నిగుండాల్లో చిందేసి తన్మయత్వం చెందుతారు. తరువాత వచ్చే ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు.

ఈ యేడు 12 వారాల జాతర

గతంలో మల్లన్న ఆలయంలో కేవలం మూడు నెలల కాలంలో ఏడు వారాల్లోనే జాతర కొనసాగేది. దీంతో సత్తేటి వారాల జాతర అని పిలిచేవారు. అప్పట్లో భక్తుల రద్దీ అంత ఎక్కువగా లేకపోవడంతో మూడు నెలలు మాత్రమే ఆలయం తెరిచి ఉండేదని, మిగతా రోజుల్లో మూసి ఉండేదని పెద్దలు చెబుతుంటారు. కాలక్రమేణా ఏయేటికాయేడు భక్తుల రాక అధికమవుతుండటంతో జాతర సమయంతో పాటు సాధారణ రోజుల్లోనూ ఆలయం రద్దీగా మారుతోంది. తిథుల ఆధారంగా బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ఒక్కోయేటా వారాల సంఖ్య పెరగడం, తగ్గడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈసారి 12 వారాలపాటు జాతర సాగనుంది.

21-01-2024 మొదటి వారం (పట్నంవారం)
28-01-2024 రెండో వారం (లష్కర్‌వారం)
04-02-2024 మూడోవారం
11-02-2024 నాలుగోవారం
18-02-2024 ఐదోవారం
25-02-2024 ఆరోవారం
03-03-2024 ఏడోవారం
08-03-2024 మహాశివరాత్రి
10-03-2024 ఎనిమిదో వారం
17-03-2024 తొమ్మిదో వారం
24-03-2024 పదోవారం
31-03-2024 పదకొండోవారం
07-04-2024 పన్నెండోవారం
(అగ్నిగుండాలతో సమాప్తం)

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

బాలాజీశర్మ, ఆలయ ఈవో



పట్నంవారంతో పాటు జాతర మూడునెలల కాలంలో మల్లన్న ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాం. భక్తులకు త్వరితగతిన దర్శనం కలిగించడంతో పాటు అందరికీ ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి వసతి కల్పించడంతో పాటు విద్యుత్ ఏర్పాట్లు చేపట్టాం. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు నిరంతరం నిర్వహించేందుకు సిబ్బందికి సూచనలు చేశాం. భక్తులకు భద్రత కోసం పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. రాజగోపుర ఆవరణలో కంట్రోల్‌రూం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

పార్లమెంట్ ఎన్నికలకు సీపీఐ సన్నద్ధం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు

సుబేదారి, జనవరి 19: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ పార్టీ సన్నద్ధమవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు తెలిపారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. జాతీయస్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ ఒక స్థానం కోరుతోందని, అందులో వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని కోరుతున్నామన్నారు. ఈ క్రమంలో సీపీఐ పార్టీ వరంగల్ పార్లమెంట్ సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, రాసమల్ల దీనా, రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ల్యాప్‌ట్యాప్ చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 19: హనుమకొండ రాజాజీనగర్‌లోని ముక్తా బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడి ల్యాప్‌ట్యాప్ చోరీ జరిగింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ జిల్లా ఫిష్‌మార్కెట్‌కు చెందిన తడకమల్ల వెంకటసుబ్బారావు హనుమకొండలో ఓ ప్రవేటు కంపెనీలో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రాజాజీనగర్‌లో ముక్తా బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తన హాస్టల్ గదితో ఉన్న ల్యాప్‌ట్యాప్ కనిపించకుండా పోయింది. హాస్టల్‌లో ఎంత వెతికినా, ఎంతమందిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం


హనుమకొండ రూరల్, జనవరి 19: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభా కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ పెద్దమ్మగడ్డలోని గిరిజన గురుకుల ప్రతిభా (బాలికల) కళాశాల ప్రిన్సిపాల్ నందమూరి పద్మిని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు www.tgtwgurukulam.telangana.gov.in, http://ttwreiscoe.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నెంబర్ 9121174434లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు ఓటరు నమోదుపై ప్రత్యేక శిబిరాలు

హనుమకొండ రూరల్, జనవరి 19: ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 యేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్‌స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలన్నారు. సంబంధిత దరఖాస్తులు బూత్‌స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

హనుమకొండ అర్బన్, జనవరి 19: తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం వివిధ డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు రెండో విడత, మాపప్ రౌండ్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ తెలిపారు. కాకతీయ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఉదయం 8.30 గంటలకు ఈ కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని, గత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివిధ రకాల పారా మెడికల్ కోర్సుల్లో 94 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.



నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయింనగర్, జనవరి 19: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని రెవెన్యూకాలనీ, ప్రగతినగర్, నాగేంద్రనగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా సోమిడి గ్రామం, విద్యానగర్, సెయింట్ ఆన్స్ స్కూల్ ఏరియా, మార్కెట్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీ-2, హంటర్‌రోడ్డు, వరంగల్ పబ్లిక్ స్కూల్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, స్నేహనగర్, రాఘవేంద్రనగర్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, యాదవనగర్, క్రిష్ణ కాలనీ, దుర్గాకాలనీ, గౌతమినగర్, రెడ్డికాలనీ, పెట్రోల్ స్టేషన్, క్రాంతి బార్, పద్మశాలి భవన్ రాయపురవాడ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమాన్‌నగర్ డబ్బాల్, నగరవీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా జీఆర్ గుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జీఆర్ గుట్ట, గిర్మాజిపేట, గ్రెయిన్ మార్కెట్, జేపీఎన్ రోడ్, లక్ష్మీపురం, మండిబజార్, చార్‌బౌళి ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా ఎస్‌ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, అబ్బనికుంట, యాకుబ్‌పూర్, ఈఎస్ఐ ఆస్పత్రి, జాన్‌పీర్లు, గొర్రెకుంట ఎక్స్‌రోడ్, నర్సంపేట రోడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, శంభునిపల్లి, ధర్మారం రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, కీర్తినగర్, గరీబ్‌నగర్, గొర్రెకుంట గ్రామం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటలవరకు, కరీమాబాద్ రోడ్, శాంతి నగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, రంగశాయిపేట, మహంకాళి ఆలయం, హంస బేకరీ, కుమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, బెస్తం చెరువు, నక్కలపల్లి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, ఎల్‌బీ నగర్, తిలక్ రోడ్, మోయిన్‌పుర, వరంగల్ ఆస్పత్రి లైన్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, శాంతి నగర్, సెకండ్ బ్యాంక్ కాలనీ, గాయత్రికాలనీ, మార్కండేయ గుడి, 80 ఫీట్ రోడ్డు, భారతి డిగ్రీ కాలేజీ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రామన్నపేట, రఘునాథ కాలనీ, బీట్ బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిట్‌లో సాంకేతిక సంబురం

ఉత్సాహంగా మొదలైన టెక్నోజియాన్

హనుమకొండ / కాజీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో శుక్రవారం ప్రతిష్ఠాత్మక వార్షిక టెక్నికల్ ఫెస్ట్ టెక్నోజియాన్-2024 ఘనంగా ప్రారంభమైంది. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి సోమశేఖర్ టెక్నోజియాన్-2024ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నోజియాన్-2024 నిర్వహణకు సమర్థవంతమైన ప్రణాళికను రూపొందించినందుకు స్టూడెంట్ ఆర్గనైజింగ్ టీమ్‌ను అభినందించారు. టెక్నోజియాన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టెక్నోజియాన్ వంటి టెక్నోఫెస్ట్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికియడంతో పాటు వారి పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకునేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. రానున్న రెండు రోజులు విద్యార్థులు నూతన సాంకేతిక అవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, సాంకేతిక విజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడగలవన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిక్రిష్ణ, ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ హరి ప్రసాద్‌రెడ్డి ఈ సందర్భంగా హాజరయ్యారు.

మూడురోజులపాటు..

ఈ టెక్నోజియాన్‌లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ నిట్ కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే టెక్నోజియాన్‌లో భాగంగా 40కిపైగా ఈవెంట్లను ప్రదర్శిస్తారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందచేస్తారు. వరంగల్ నిట్‌లో 2006 నుంచి క్రమం తప్పకుండా ప్రతీఏటా ఈ టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం కొత్త ఇతివృత్తంతో దీనిని జరపడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ఇంజినియస్ థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు. అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన స్ఫూర్తికి ప్రతీకగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. దీనికి అనుగుణంగా టెక్నోజియాన్‌లో నిర్వహించే ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, చర్చలు, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి.

చివరి నిమిషంలో మార్పు

వాస్తవానికి టెక్నోజియాన్-2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రఖ్యాత ఏరోస్పేస్, మిస్సైల్ సైంటిస్టు ప్రొఫెసర్ సుందరరాజన్ హాజరు కావలసి ఉంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు చెందిన బ్రహ్మోస్, అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్ వంటి అత్యంత శక్తివంతమైన క్షిపణుల రూపకల్పన, ఉత్పత్తి, అభివృద్ధిలో కీలకభూమి పోషించిన సుందరరాజన్ రాకకోసం విద్యార్థులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఆయనను కలవడానికి ఉత్సాహపడ్డారు. కానీ అకస్మాత్తుగా ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ప్రారంభోత్స కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. దీంతో చివరి నిమిషంలో కార్యక్రమంలో మార్పు జరిగింది. ప్రొఫెసర్ సుందరరాజన్ స్థానంలో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి సోమశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై టెక్నోజియాన్‌ను ప్రారంభించారు.

ప్రముఖల ప్రసంగాలు

టెక్నోజియాన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సాంకేతిక నిపుణులు విద్యార్థులకు మార్గదర్శనం నెరుపనున్నారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులపై విద్యార్థులతో చర్చించనున్నారు. రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో శాస్త్రవేత్త టీఎన్ సురేష్‌కుమార్, ఇన్‌ఫ్లూయన్సర్ వంశీ కూరపాటి తదితరులు టెక్నోజియాన్‌కు హాజరవుతున్న ప్రముఖుల్లో ఉన్నారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఉన్నాయి.

40కిపైగా ఈవెంట్లు

ఈ ఫెస్ట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడానికి 40కిపైగా టాప్ క్లాస్ ఈవెంట్లను నిర్వహిస్తారు. ఈ వెంట్లను తిలకించేందుకు నిట్ విద్యార్థులే కాకుండా బయట వివిధ ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలలకుచెందిన విద్యార్థులు కూడా పెద్దసంఖ్యలో హాజరుకానున్నారు. టెక్నోజియాన్ సందర్భంగా నిర్వహించే ఈవెంట్లలో జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, విర్చువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా మొదలైనవి ఉన్నాయి. ఈ రెండురోజుల్లో మ్యాట్ ల్యాబ్, టీవర్క్స్ ద్వారా రాపిడ్ ప్రోటోటైపింగ్, సిమ్యూలింక్ మాస్టర్, ఇన్నోసెర్చ్ తదితరవాటిపై వర్క్‌షాపులు కూడా ఉంటాయి. నిట్‌లోని ప్రతీ డిపార్ట్‌మెంట్ వివిధ సాంకేతిక కార్యక్రమాలను, క్విజ్‌లను నిర్వహిస్తాయి. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన స్పర్థక్ బృందం వాహన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకోనున్నది.



విద్యుత్ వెలుగుల్లో దగద్ధాయమానంగా వెలిగిపోతున్న నిట్ కళాశాల భవనం

తొలి రోజు

తొలిరోజు ఈవెంట్లు మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదలయ్యాయి. మెటాల్యూజన్, ప్లేజో పవర్ ఆర్కేడ్, రీసెర్చ్ నెక్సెస్, బయో హాక్, లెర్న్ అండ్ ఎర్న్ ఎలక్ట్రిసిటీ, ఆటోమిఇన్‌సైట్, బీసీ ట్రేడింగ్ పిట్, బ్రెయిన్ గేమ్ పోస్టర్ గాలా, కెమ్ ఈ ఎక్స్‌టెంపోర్, ఆర్బిక్స్ ఆర్‌సీ బగ్గీ, పజిల్ టు పేపర్, ఇన్నోకెమ్, మోడల్ డెమాన్‌స్ట్రేషన్, మైండ్ గ్రైండ్, ఏసీ సెలస్టియల్ క్లీనప్, హెచ్‌బీఏన్ ఓరిగామి, ఎన్‌హెచ్ ఇన్నోవేట్, ఎస్‌డీసీ క్రాక్ దక్వెరీ ఆర్కాడేరియం, ఆర్‌సీ బోట్‌ఆర్కేడ్, రీసెర్చ్ ఒడిస్సీ ప్రింట్ యువర్ ప్రాజెక్టు తదితర వీటిలో ఉన్నాయి.

ఈవెంట్లు మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఎనిమిది ఈవెంట్ల మొదటి రౌండ్‌ను టెక్నోజియాన్ ప్రారంభోత్సవానికి ముందు నిర్వహించారు.



టెక్నోజియాన్-2024 నిర్వహిస్తున్న విద్యార్థుల బృందం



పాఠశాల విద్యార్థులు రూపొందించిన డిటెక్టర్ ఎగ్జిబిట్లు

ఆకట్టుకుంటున్న ఈవెంట్లు, ఆవిష్కరణలు

ప్రతిభను చాటుతున్న విద్యార్థులు.. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టెక్నోజియాన్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలోచింపచేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వీటిలో మచ్చుకు కొన్ని..

ట్రేడింగ్ పిట్ :



స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ప్రపంచం ఎలా ఉంటుందో విద్యార్థులకు అనుభవపూర్వకంగా తెలియచేయడం ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో పాల్గొనేవారు రియల్ టైమ్ (నిజ సమయం), స్టాక్ ట్రేడింగ్ సాదృశ్యాలలో పాల్గొంటారు. వీరు స్టాక్ మార్కెట్లలో రియల్ టైమ్‌లో పెట్టుబడులు పెట్టే అనుభూతిని ప్రత్యక్షంగా పొందుతారు. అనుభవాన్ని గడిస్తారు. స్టాక్ ట్రేడింగ్‌లో ఎక్కువ డబ్బు సంపాదించిన విద్యార్థులను విజేతలుగా ప్రకటిస్తారు.

ఆర్బిక్స్



ఉపగ్రహ ప్రయోగాలు, అంతరిక్ష వికిరణాల ద్వారా ఉత్పత్తయ్యే ఈ-వ్యర్థాల వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి కొన్ని క్షేత్రస్థాయిలో వినూత్నమైన రీతిలో విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకునేందుకు వీలుకల్పించడం ఈ ఈవెంట్ లక్ష్యం. ఇందులో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై తమ ఆలోచనలను వివరించారు.

క్రాక్ ది క్వెరీ



క్రాక్ ది క్వెరీ అనేది ఎస్‌క్యూఎల్ కోడింగ్ పోటీ. ఇందులో పాల్గొనేవారు ఎస్‌క్యూఎల్‌ని ఉపయోగించి సవాళ్లను ఎదుర్కొంటారు.

ఇన్నోకెమ్




సుస్థిరమైన పర్యావరణను ప్రోత్సహించడానికి విద్యార్థులు తాము చేసిన పరిశోధనలను వివరించేందుకు వెదిక కల్పించడం ఈ ఈవెంట్ ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో భాగంగా విద్యార్థులు సుస్థిర పర్యావరణంపై విద్యార్థులు వివిధ అంశాలను ప్రదర్శించారు.

హ్యాండ్ ఇన్ ప్రింట్

విద్యార్థులు తమ స్నేహితులతో గడిపిన క్షణాలను చిరకాలం జ్ఞాపకం ఉండే గుర్తులే హ్యాండ్ ఇన్ ప్రింట్ ఈవెంట్. ఒక రసాయనంలో తమ చేతులను ముంచి ఒక తెల్లని వస్త్రంపై అద్దితే ముద్రలు పడతాయి. వాటిని గుర్తుగా తమ వద్ద ఉంచుకోవచ్చు.

వీఆర్ గేమింగ్



ఇది ఒక విచిత్రమైన ఆట. మైదానంలోకి వెళ్లి క్రికెట్ ఆడడంలో పొందే అనుభూతిని కేవలం కళ్ళకు ప్రత్యేకంగా రూపొందించిన గ్లాస్‌లను పెట్టుకోవడం ద్వారా పొందవచ్చు. ఈ గ్లాస్‌లను ధరించి బ్యాట్‌తో బాల్‌ను కొడితే గ్రౌండ్‌లో నిజంగా ఆడినట్టే ఉంటుంది.

విద్యార్థులకు ప్రత్యేకంగా..



ఈ టెక్నోజియాన్‌లో నిట్ విద్యార్థులే కాకుండా పాఠశాల విద్యార్థులు సైతం తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఆయా సైన్స్‌ఫేయిర్లలో ప్రదర్శించిన తమ ఎగ్జిబిట్లను టెక్నోజియాన్‌లో కూడా ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. నిట్ విద్యార్థులతో పోటీ పడేలా వీరి ఎగ్జిబిట్లు ఉన్నాయి.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

కాటారం, జనవరి 19: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో శనివారం నుంచి ఈ నెల 24 వరకు పత్తి కొనుగోళ్లు జరగవని ఏఎంసీ ఛైర్‌పర్సన్ పెండ్యాల మమత, కార్యదర్శి లాషరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీసీఐ సెంటర్‌లో పత్తి నిల్వలు పెరిగి దిగుమతి చేయడానికి స్థలం లేనందున జిన్నింగ్ చేసే నాలుగు రోజులు పత్తి కొనగోళ్ల నిలిపివేయనున్నట్లు సీసీఐ కేంద్రం ఇంచార్జి అభయ్‌ప్రతాప్‌సింగ్ చెప్పారన్నారు. సీసీఐ సెంటర్‌లో యథావిధిగా 25 నుంచి కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

జిల్లాలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 19 : జిల్లాలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఇ.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు బాలికల రక్షణ, అభివృద్ధి, వికాసంపై గ్రామ, మండల స్థాయిల్లోని వివిధ విద్యా సంస్థల్లో అవగాహన నిర్వహిస్తామన్నారు. శనివారం కాటారంలో, 22న మల్హర్‌లో, 23న మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల్లో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 24న జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో విద్యా రంగంలో, సామాజిక సేవలో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తామని వెల్లడించారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లిటౌన్, జనవరి 19 : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా సీనియర్ నాయకుడు కందుకూరి దేవదాసు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గొర్లవీడు గ్రామంలో గల ఉన్నత పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు, నీళ్లు, నియామకాలు అనే నినాదంతో వచ్చిన గత ప్రభుత్వం పది సంవత్సరాలు విద్యా రంగంపై చిన్నచూపు చూసిందని అన్నారు. అలా కాకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సమస్యలపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయప్రకాష్, వెంకటేశ్వర్లు, వంశీ, వాసుదేవ్, నవనీత్, మాలతి, శంకర్‌రావు, సుధాకర్ రెడ్డి, రఘుపతి, సునీత, మమత, మేరీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖారే

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 19 : యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖారే అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణాంతకమని అన్నారు. డ్రగ్స్ దేశ శక్తిని, యువతను నిర్వర్యం చేస్తుందని తెలిపారు. డ్రగ్స్ సమాజ మనుగడకు యువత జీవితానికి వినాశకరి అన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి అందమైన జీవితాన్ని ఆనందంగా గడపాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ రవాణా, వినియోగంపై పటిష్టమైన నిఘా పెట్టినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఛైర్‌పర్సన్‌గా ఏడుగురు సభ్యులతో కూడిన యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ దేవ్‌రాజుడే, డీఎస్పీ రాములు, చిట్యాల సీఐ వేణు చందర్, గణపురం ఎస్ఐ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 19 : భూపాలపల్లిలోని ఎండీ క్వార్టర్స్‌కు చెందిన సింగరేణి కార్మికుడు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. ఎండీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న పెరుచునపల్లి శ్రీధర్(45) అనే వ్యక్తి.. 8 ఇంక్లైన్‌లో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజు మాదిరిగా విధులకు వెళ్లి ఇంటికి వచ్చిన శ్రీధర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్‌రూం వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా అస్వస్థతతో గుండెపోటుకు గురై అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే శ్రీధర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ములుగు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి


సమీక్షలో కలెక్టర్ ఇలా త్రిపాఠి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, జనవరి 19: ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే సమీక్ష సమావేశానికి ములుగు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో హనుమకొండ ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యావరణం, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)లు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారని అన్నారు. ములుగు జిల్లాలో వివిధ శాఖల ద్వారా కొనసాగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, పనులు, అవసరమయ్యే ఇతర ప్రతిపాదిత పనుల గురించి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అన్నారు. ఈ సమావేశానికి నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, రోడ్లు, భవనాలు, జీహెచ్ఎంసీ, జాతీయ రహదారులు, ఐటీడీఏ, గృహ నిర్మాణం, పోలీస్, అటవీ, ఎండోమెంట్ శాఖల అధికారులు, మేడారం జాతరలో వివిధ శాఖల ద్వారా పనులు చేపడుతున్న అధికారులు నివేదికలతో హాజరు కావాలని అన్నారు.

ఈ సమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో ప్రసూనరాణి, డీఆర్‌డీవో నాగపద్మజ, డీపీవో వెంకయ్య, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి


యాచకుడి మృతదేహం

ములుగు, జనవరి 19: జిల్లా కేంద్రం సమీపంలోని ప్రేమ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ బస్ షెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ములుగు పోలీసులు శుక్రవారం గుర్తించారు. సుమారు 60ఏళ్లు ఉన్న ఈ వ్యక్తి కొంతకాలంగా బస్‌షెల్టర్‌లో ఉంటూ భిక్షాటన చేస్తున్నాడని స్థానికుల ద్వారా తెలిసింది. తీవ్ర అనారోగ్యంతో అతను మరణించినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని ములుగు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 8712670082, 8712670081 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

గట్టమ్మ తల్లిని దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం


ఆలయం ఆవరణలో నాయకులతో జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, జనవరి 19: భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎంపికైన సిరికొండ బలరాం శుక్రవారం నాయకులతో కలిసి ములుగు సమీపంలోని గట్టమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల పక్షాన నిలబడి సమస్యలను తీర్చడానికి కృషి చేస్తానని అన్నారు. తనకు జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, అంతకుముందు నాయకులు బలరాంను కలిసి పూలబొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, భూక్య జవహర్‌లాల్, శీలమంతుల రవీంద్రచారి, చల్లూరి మహేందర్, చింతలపూడి చిన్నకొండారెడ్డి, రవిరెడ్డి, కృష్ణాకర్‌రావు, కొత్త సురేందర్, గాదం కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, రాజన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

చిట్యాల, జనవరి 19: మండల కేంద్రంలోని స్థానిక సామాజిక ఆస్పత్రిని కాయకల్ప బృందంసభ్యులు శుక్రవారం సందర్శించారు. వైద్యులు సురేష్, శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్వాలిటీ మేనేజర్ భానుప్రకాష్ ఆస్పత్రి పరిసరాలను, వార్డులు, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, గదులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అఖిల, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 19 : భూపాలపల్లి పట్టణంలోని ఐసీడీఎస్ భవన్‌లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా నిరోధించడంపై అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీవో అవంతి, ప్రజ్వల ప్రాజెక్టు మేనేజర్ బాలరామక్రిష్ణ, కోఆర్డినేటర్ శ్రావ్యశృతిలు హాజరై మాట్లాడారు. ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం లఘు చిత్రాలను ప్రదర్శించారు.

ఇసుక క్వారీల కోసం నేడు పెసా గ్రామసభలు

మంగపేట, జనవరి 19 : మండలంలోని కత్తిగూడెం, రాజుపేటలో శనివారం ఉదయం 10 గంటలకు ఇసుక క్వారీల ఎంపిక కోసం పెసా కమిటీల ఆధ్వర్యంలో గిరిజన సొసైటీల సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఆలేటి సుదర్శన్, మండల ప్రత్యేక అధికారి తుల రవి, ఎంపీవో మమత తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. ఈ గ్రామ సభలకు మైనింగ్ అధికారులతో పాటు పంచాయతీ అధికారులు, పెసా జిల్లా కో-ఆర్డినేటర్, గ్రామాల మొబిలైజర్స్ హాజరవుతున్నారని చెప్పారు. ఆయా గ్రామాల గిరిజనులు సభల్లో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని అన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 19: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చి పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జిల్లా అధికారులతో మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఓటరు నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ జనవరి 1, 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఓటరు జాబితాలో మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, లాజికల్ పొరపాట్లు, డెమో గ్రాఫికల్ పొరపాట్లు పూర్తి స్థాయిలో సవరించాలన్నారు. ఈ నెల 6న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై ప్రజల నుంచి 22 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ఫిబ్రవరి 2 వరకు పరిష్కరించాలని అన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది జాబితాను రూపొందించాలన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ వీసీలో కలెక్టర్ భవేష్ మిశ్రా, ఆర్డీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 19 : విద్యార్థి దశలోనే సుస్థిర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నేషనల్ గ్రీన్‌కార్ప్స్(ఎన్‌జీసీ) రాష్ట్ర ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం ములుగు మండలం బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో 'సుస్థిర జీవన విధానం' అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దైనందిన జీవితంలో మనం చేస్తున్న పొరపాట్లు, అలవాట్లతో ప్రకృతి దెబ్బతింటుందని, కాలుష్యం పెరుగుతుందని అన్నారు. వాటిపై అవగాహన పెంచుకుంటే గాలి, నీరు, నేల కలుషితం కాకుండా చూడొచ్చని, పర్యావరణ పరిరక్షణలో భాగమవడం సులభతరం అవుతుందని తెలిపారు. చెత్త నిర్వహణ, కంపోస్టు ఎరువుల తయారీ, ప్రకృతి కాలుష్య విధానాన్ని చిన్నచిన్న ప్రయోగాలతో ప్రత్యక్షంగా వివరించారు. పరిశుభ్రత ఇంటి నుంచే మొదలైతే చాలా వ్యాధులకు అడ్డుకట్ట వేయగలుగుతామని చెప్పారు. అనంతరం సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాజిక్ షో పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్పీలు శివకిరణ్, ఇ.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, సెక్టోరల్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ అన్నెం విజయమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.శోభారాణితో పాటు జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పనుల్లో అవకతవకలపై సీఎంకు లేఖ

ములుగు కలెక్టరేట్, జనవరి 19 : ములుగు జిల్లాలోని మల్లంపల్లి మీదుగా జరుగుతున్న 163వ జాతీయ రహదారి పనుల్లో అవకతవకలు ఉన్నాయని, పనుల్లో నాణ్యత, సేఫ్టీ, క్యూరింగ్ సరిగా లేదని పేర్కొంటూ భవిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కత్తి మొగిలి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖ పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యత లేదని, సిబ్బంది భద్రతా చర్యలు తీసుకోవడం లేదని, క్యూరింగ్ కూడా చేయడం లేదని పేర్కొన్నారు. మేడారం మహాజాతర సమీపించిన కారణంగా భక్తులకు రవాణా సంబంధిత భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత శాఖ మంత్రులు, అధికారులు జాతీయ రహదారి నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాల యాజమాన్య కమిటీల నోటిఫికేషన్ విడుదల

డీఈవో రామ్‌కుమార్ వెల్లడి

భూపాలపల్లిటౌన్, జనవరి 19 : పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటునకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి రామ్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్స్, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో యాజమాన్య కమిటీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లాలోని వివిధ మండలాల ఎంఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు గల విద్యార్థుల తల్లిదండ్రులను ముగ్గురిని ఈ కమిటీలో సభ్యులుగా తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల (5వ తరగతి వరకు) స్థాయిలో 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో (1 నుంచి 7వ తరగతి వరకు) 21 మందిని, ఉన్నత పాఠశాల స్థాయిలో (6 నుంచి 8వ తరగతి వరకు) 9 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేయాలని చెప్పారు. పాఠశాల యాజమాన్య కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ ఆఫీషియల్ మెంబర్(ప్రధానోపాధ్యాయుడు), ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఐదుగురు, కోఆప్టెట్ ఇద్దరు సభ్యులు, శాశ్వత సభ్యులుగా సర్పంచ్, మునిసిపల్ చైర్మన్ ఉంటారని పేర్కొన్నారు. ఈ కమిటీలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 20న ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక కోసం నోటీసులు ప్రచురించడం, 24న సభ్యుల ఎంపిక కోసం తల్లిదండ్రుల తుది జాబితాను నోటీసు బోర్డుపై అతికించడం, 29న నూతన ఎస్ఎంసీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

బ్యారేజీలను సందర్శించిన బ్యాంకర్లు


లక్ష్మీ పంపుహౌస్ వద్ద పలు బ్యాంకుల అధికారుల బృందం

మహదేవపూర్/మహదేవపూర్ రూరల్, జనవరి 19: కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్(కేఐపీసీఎల్) అకౌంట్ పేరుతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కన్సార్టియం లోన్ కింద తీసుకున్న అప్పుకు సంబంధించి పలు బ్యాంకుల అధికారులు మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ, సరస్వతీబ్యారేజీ, లక్ష్మీ పంపుహౌస్‌లను శుక్రవారం సందర్శించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కన్సార్టియం బ్యాంకులైన యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతో పాటు కేఐపీసీఎల్ అధికారులు మధ్యాహ్నం 12 గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని వంతెనతో పాటు కుంగిన పిల్లర్లను పరిశీలించారు. 12 మందితో కూడిన బృందం సందర్శించి అధికారులను అడిగి వివరాలు సేకరించారు. బ్యారేజీ కుంగడంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు కొనసాగుతున్న నేపథ్యంలో బ్యాంకర్ల సందర్శన ప్రాధాన్యం సంతరించుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేఐపీసీఎల్ ఏర్పాటు చేసి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కన్సార్టియం కింద వివిధ బ్యాంకుల నుంచి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పు తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పు ఇచ్చిన బ్యాంకుల అధికారులతో పాటు కేఐపీసీఎల్ అధికారులు ప్రతి ఏడాది బ్యారేజీలను సందర్శించడం సాధారణమేనని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అందులో భాగంగానే శుక్రవారం బ్యాంకర్లు మేడిగడ్డ బ్యారేజీ, సరస్వతీ బ్యారేజీ, లక్ష్మీ పంపుహౌస్‌ల సందర్శనకు వచ్చారని అధికారులు పేర్కొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

గోవిందరావుపేట, జనవరి 19: గోవిందరావుపేటలోని ఎమ్మార్సీ ఆవరణలో పీఆర్టీయూ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను శుక్రవారం ఎంఈవో గొంది దివాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కె.నాగేశ్వర్‌రావు, నాయకులు తులసీరామ్, రమేష్, కిషోర్‌బాబు, కేశవరావు, మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

టేకుమట్ల, జనవరి 19 : పీఆర్టీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చి రాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా టేకుమట్ల జడ్పీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న పెంతల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శిగా రామక్రిష్టాపూర్(టి) ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మిడిదొడ్డి రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికకు ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యక్షుడిగా సోమనపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు లింగమూర్తిని ఎన్నుకున్నారు.

హామీలను అమలు చేయాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 19 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆదివాసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కొమరంభీం కాలనీలో సంఘం సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. కొమరంభీం కాలనీలో 30ఏళ్ల నుంచి ఆదివాసీలు నివాసం ఉంటున్నారని, ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.

ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 19 : 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ సర్వర్ పాషా అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 20, 21 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటరు నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు. ఈసమావేశంలో బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నవోదయ అర్హత ప్రవేశ పరీక్ష

భూపాలపల్లిటౌన్, జనవరి 19: జవహర్ నవోదయలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందడానికి గాను శనివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో రామ్‌కుమార్ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో 435 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు. భూపాలపల్లిలోని జడ్పీహెచ్ఎస్ సెంటర్‌లో 238 మంది, కాటారంలోని జడ్పీహెచ్ఎస్‌లో 197 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు.

ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

కాటారం, జనవరి 19 : మండలంలోని జాదరావుపేట జీపీ పరిధిలోని రఘుపల్లి గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి దామోదర్‌రెడ్డి, వేమునూరి వెంకన్న, అరుణ్‌కుమార్ అనే నిందితులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులో శుక్రవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 12న గ్రామానికి చెందిన గోమాస పోషమల్లుతో ముగ్గురు వ్యక్తులు గొడవ పడ్డారన్నారు. అతడిపై దాడి చేసి గొడ్డలితో తలపై నరికారు. ఈ సంఘటనపై 13న పోషమల్లు ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదైంది. సాక్షులను విచారణ చేసిన అనంతరం ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ వెల్లడించారు.

అటవీశాఖ అధికారులకు అవగాహన

ములుగు కలెక్టరేట్, జనవరి 19: ములుగులోని అటవీశాఖ సమావేశపు హాల్‌లో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ ఆధ్వర్యంలో ముంబయికి చెందిన వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ ట్రస్టు సిబ్బంది శుక్రవారం ములుగు, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అటవీశాఖ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అటవీ జంతువుల వేట-నివారణ, వేట చేసిన వారిపై కేసుల నమోదు, హంటింగ్ చేసిన వారిపై జైలుశిక్ష, ఏ కేసు నమోదు చేయాలనే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ములుగు అటవీ క్షేత్రాధికారి డోలి శంకర్, సీనియర్ ట్రైనర్లు సంయుక్త, సంజయ్ ఠాగూర్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపేటలో ఎస్‌బీఐ శాఖ ఏర్పాటు చేయాలి

మంగపేట, జనవరి 19: మండలంలోని రాజుపేటలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ ములుగు డివిజన్ సహాయ కార్యదర్శి డి.జయకృష్ణ ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం రాజుపేటలో డీవైఎఫ్ఐ డివిజన్ సమావేశం సంఘం నాయకుడు సురేష్ అధ్యక్షతన జరుగగా, జయకృష్ణ హాజరై మాట్లాడారు. కమలాపురం, ఏటూరునాగారంలలో బ్యాంకు శాఖలు ఉన్నందున 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రాజుపేట కేంద్రంగా బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం డివిజన్ నాయకులు నవీన్, కేశవ్, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

22న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ములుగు కలెక్టరేట్, జనవరి 19 : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'మేడారం మహాజాతర - పోలీసుల సేవ' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయులు పాఠశాల స్థాయిలో నిర్వహించి మొదటి, మూడు స్థానాలు సాధించిన విద్యార్థుల చిత్రాలను 23న డీఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

(5వ పేజీ తరువాయి)

బీసీసీఎల్ జార్ఖండ్ జట్లు తలపడ్డాయి. ఎంసీఎల్ ఒడిషా జట్టు 6 గోల్స్ చేయగా, ప్రత్యర్థి జట్టు చేతులెత్తేసింది. అనంతరం సీసీఎల్ జార్ఖండ్, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. చివరి వరకు గెలుపు కోసం నువ్వా నేనా అన్నట్లుగా ఇరు జట్ల క్రీడాకారులు పోటీ పడ్డారు. ఇందులో సీసీఎల్ జార్ఖండ్ జట్టు మూడు గోల్స్ చేయగా, ఎన్‌సీఎల్ జట్టు రెండు గోల్స్ చేసింది. చివరికి సీసీఎల్ జార్ఖండ్ జట్టు చేతిలో ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్టు ఒక్క గోల్స్ తేడాతో ఓటమి చెందింది. అలాగే మధ్యాహ్నం ప్రారంభమైన మ్యాచ్‌లో ఎస్‌సీసీఎల్ తెలంగాణ, ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్ జట్లు తలపడ్డాయి. ఇందులో ఎస్‌సీసీఎల్ తెలంగాణ జట్టు ఒక గోల్స్ చేయగా ప్రత్యర్థి జట్టు ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్ మూడు గోల్స్ చేసి విజయకేతనం ఎగురవేసింది. చివరిగా డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర, ఈసీఎల్ వెస్ట్ బెంగాల్ జట్లు తలపడ్డాయి. ఇందులో డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర 7 గోల్స్ చేసింది. ప్రత్యర్థి జట్టు ఈసీఎల్ వెస్ట్ బెంగాల్ స్కోర్ చేయకుండానే చేతులెత్తేసింది.

నేడు ఆడనున్న జట్లు ఇవే..

కోల్ ఇండియా లెవల్ హాకీ పోటీల్లో శనివారం మొదటి మ్యాచ్ ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్, ఎంసీఎల్ ఒడిషా జట్లు తలపడనున్నాయి. అలాగే రెండవ మ్యాచ్ సీసీఎల్ జార్ఖండ్, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్లు తలపడతాయి. మూడవ మ్యాచ్ మధ్యాహ్నం ఎస్‌సీసీఎల్ తెలంగాణ, బీసీసీఎల్ జార్ఖండ్ జట్లు పోటీ పడతాయి. నాలుగవ మ్యాచ్‌లో ఈసీఎల్ వెస్ట్ బెంగాల్ జట్టు, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్టు ఆడనున్నాయి.

మేడారం ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయాలి

తాడ్వాయి, జనవరి 19 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమీపిస్తున్నందున ట్రస్టుబోర్డును ఏర్పాటు చేసి వేల్పుల జాతరలకు రూ.100 కోట్లు కేటాయించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు కోరగట్ల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమవేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మేడారం జాతర నిర్వహణ కోసం త్వరితగతిన ట్రస్టుబోర్డును ఏర్పాటు చేసి గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న కోయ, నాయకపోడ్ వేల్పుల జాతరల నిర్వహణ అభివృద్ధి చేసే బోర్డుగా చేయాలన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో 205 కోయవేల్పు జాతరలు ఉన్నాయని, నేటికీ కోయ ఇలవేల్పులు చెట్లకింద పూరి గుడిసెల్లోనే మగ్గుతున్నాయని అన్నారు. పూజా సామగ్రికి సరిపడా డబ్బులు లేక ఎన్నో జాతరలు అన్యమతం ముసుగులో కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇలవేల్పు జాతరకు ప్రభుత్వం రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజ నారాయణ, నాయకులు అన్నెబోయిన సమ్మయ్య, మోకాళ్ల వెంకటేష్, యాలం విక్రమ్, వట్టం లక్ష్మీనారాయణ, తాటి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి పాదయాత్ర

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి


ఆలయం వద్ద మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

భూపాలపల్లిటౌన్, జనవరి 19: భూపాలపల్లి పట్టణం మంజూర్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధి నుంచి పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పాదయాత్ర షెడ్యూల్‌ను ప్రకటించారు. తాను ఆలయ నిర్మాణం ప్రారంభంకు ముందు విగ్రహ ప్రతిష్ఠాపన తర్వాత పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నానని తెలిపారు. ఈ క్రమంలోనే తాను మొక్కును తీర్చుకోవడానికి పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర సుమారు 15 రోజుల నుంచి 20 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. భూపాలపల్లి నుంచి ములుగు మల్లంపల్లి మీదుగా నర్సంపేట, నెక్కొండ, ఒంటిమిట్ట, కోడూరుకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రజలు ఆసక్తి ఉంటే పాల్గొని ఆ దేవుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ గుడికి కావాల్సిన నిర్మాణాలే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇక్కడ ఎలాంటి భూకబ్జాలు జరగడం లేదని అన్నారు.